# మేధావుల మౌనం – ఎవరికి ప్రమాదం?

అవును, ఇక్కడ **విద్యా వ్యవస్థ** గురించే మాట్లాడుకుంటున్నాం. ఎందుకంటే ప్రభుత్వ వ్యవస్థ లో ఎన్ని శాఖలున్నా వాటిలో ఎన్నెన్నో సమస్యలున్నా, అన్ని శాఖలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసేది విద్యా శాఖ మాత్రమే. విద్యా వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉంటే దేశం అంత సుభిక్షంగా ఉంటుంది.

ఈ రోజు విద్యా రంగంలో ముఖ్యంగా **పాఠశాల విద్య**లో పలు కీలక సమస్యలున్నాయి. ప్రతీ సమస్యకీ వంద కారణాలున్నాయి. ఆ కారణాల గురించి పదే పదే అలుపు లేకుండా మాట్లాడే వారూ ఉన్నారు. ఎటొచ్చీ ఆ సమస్యలకి పరిష్కారాలు అన్వేషించే ప్రయత్నం చేసేవాళ్ళు, ఆ ప్రయత్నం చేస్తున్న వారిని ప్రోత్సహించే వాళ్ళు కరువైపోతున్నారనేది అందరం ఒప్పుకోవాల్సిన చేదు నిజం.

**ఈ మధ్య కాలంలో అన్ని వర్గాలనీ కలవరపడుతున్న ఒక సమస్య – పాఠశాలల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు**

## పాఠశాలల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు

అసలు విద్యా వ్యవస్థలో ఇటువంటి సమస్య గురించి మాట్లాడుకోవాల్సి రావడం మన దౌర్భాగ్యం. ప్రభుత్వ పాఠశాలలకు ఆడపిల్లలే అసలైన అందం. కొన్ని కో-ఎడ్ పాఠశాలల్లో 90% ఆడపిల్లలు కూడా ఉన్నారు.

తల్లిదండ్రులు తమకున్న వివిధ కారణాలు, అవగాహన మూలంగా మగపిల్లల్ని ప్రైవేటు బస్సులు ఎక్కిస్తూ, ఆడపిల్లలని మాత్రం ప్రభుత్వ బడులకు పంపుతున్నారు. వారికున్న కారణాల్లో "*ఇంటికి దగ్గరలో మనమ్మాయి ఉంటుంది, ప్రభుత్వ బడిలో పదిలంగా ఉంటుంది*" అనేవి కూడా బలమైన కారణాలు. కాని ఈ మధ్య కాలంలో బయట పడుతున్న ఒక్కొక్క సంఘటన ప్రత్యక్షంగా చూస్తుంటే, మన బడులు ఆడపిల్లలకు అంత క్షేమకరంగా లేవేమో అనిపిస్తుంది. తల్లిదండ్రుల నమ్మకం సడలుతోంది. బయటపడ్డ సంఘటనలు కొన్నే అయినా, "*ఇలాంటి కీచకులు ఇంకా చాలా పాఠశాలల్లో ఉన్నారు. ఇలా ఎంత మందిని ఏరగలం*" అనే కామెంట్స్ ఉపాధ్యాయులనుండే వస్తున్నాయి అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కాపు కాయాల్సిన వాళ్లే కబళించే ప్రయత్నం చేస్తే ఆ పసి మనసులు ఎంత గాయపడతాయి, దాని పర్యవసానం వారి జీవితం లో ఎలా ఉంటుంది, వాళ్లు ఎవరితో చెప్పుకోవాలి.... ఇవి ఆలోచిస్తుంటే మనసు కలిచివేస్తుంది.

ఈ వృత్తిలో ఇటువంటి వాళ్ళు ఉంటారా, ఉండవచ్చా?

సమాజాన్ని నడిపించే నాయకులను తయారుచేసే అద్భుతమైన అవకాశం ఉండి, కౌమార దశలో ఉన్న పిల్లల గజిబిజి ఆలోచనలు సరిచెయ్యడం మానేసి, పాఠశాల వాతావరణం కలుషితం చేసే ఇలాంటి నికృష్టమైన ఆలోచనలు వీళ్ళకి ఎలా వస్తాయి? ఇదొక మానసిక రోగమా? వ్యవస్థపై ఉన్న చులకన భావమా?

చేతులెత్తి నమస్కరించాల్సిన వృత్తికే కళంకం తెస్తూ తులసీ వనంలో గంజాయి మొక్కల్లాంటి వీళ్ళని ఏం చెయ్యాలి? వీళ్ళకు ఎవరు చెప్పాలి, ఎలా చెబితే అర్థం అవుతుంది?

# మేధావుల మౌనం – ఎవరికి ప్రమాదం?

**ఇటువంటి ప్రశ్నలకి సమాధానం ఎవరు చెబుతారు? మన మధ్య చాలా మంది మేధావులు, విద్యావేత్తలు ఉన్నారు. ఇలాంటి సమస్యల మీద వెంటనే ఎందుకు స్పందించలేక పోతున్నారు? మౌనంగా ఎందుకు ఉంటున్నారు? ఈ మౌనం ఖరీదు ఎంత?**

ఈ సమస్యలో గమనించిన మరొక కోణం – *"ఇలాంటి సమస్య మా ఊరి పాఠశాలలో ఉందని తెలిస్తే మా ఊరు పరువు పోతుంది. అందుకే చూసీ చూడనట్టు ఊరుకుంటున్నాం... మందలించి వదిలేస్తున్నాం".*

అలాగా?.....

మరి ఈ వేధింపుల మూలంగా కొంతమంది ఆడపిల్లలు బడి మానేస్తున్నారు, కొంతమంది దూరంగా ఉన్న వేరే బడికి పోతున్నారు. మరి కొంతమంది అయితే చిన్నారి పెళ్ళికూతుళ్ళు గా మారుతున్నారు. మరి వీటివల్ల పాఠశాల పరువు, ఊరి పరువు పోవడం లేదా? ఒకవేళ వేధింపుల తీవ్రత ఎక్కువై ఆత్మహత్యా ప్రయత్నం లాంటివి జరిగితే అప్పుడు పరిస్థితి ఏంటి? ఇలాంటివి కొన్ని చోట్ల జరుగుతూనే ఉన్నాయి కదా? **మన ఆడపిల్ల, ఒక ఇంటి గారాల బిడ్డ, రేపటి అమ్మ గౌరవం కన్నా పాఠశాల పరువు, ఊరి పరువు ఎక్కువా? పిల్లల కోసం పాఠశాల పెట్టామా? పాఠశాల కోసం పిల్లలున్నారా?**

## పరిశీలనలు & సూచనలు – Observations & Recommendations:

1) లైంగిక వేధింపులు కేవలం ఆడపిల్లల మీద మాత్రమే కాదు. మగ పిల్లల మీద కూడా జరుగుతున్నాయి. కాని వివిధ కారణాల వల్ల అవి బయట పడటం లేదు. వేధింపుల విషయంలో శిక్షలో భాగంగా కొంతమంది ఉపాధ్యాయులను మగపిల్లల స్కూల్స్ కి (Boys Schools) పంపుతున్నారు. మగపిల్లలు కూడా పిల్లలే కదా? ఇలాంటి వారివల్ల ఆ పిల్లలు కూడా ఇబ్బంది పడే అవకాశం ఉంది.

2) Collector / Joint Collector స్థాయిలో ప్రాథమిక విచారణ ద్వారా ఈ వేధింపుల అభియోగం రుజువు అయితే, అటువంటి ఉపాధ్యాయులను ఏ పాఠశాల దరిదాపులకీ రానివ్వకూడదు. ఉపాధ్యాయ సంఘాలు వారి సభ్యత్వాన్ని రద్దు చెయ్యాలి. వారు తమ సొంత స్కూల్స్ / ట్యూషన్ సెంటర్ నడుపుకునే అవకాశం ఇవ్వకూడదు.

3) పాఠశాలలలో – 8, 9, 10 వ తరగతిలో ఉన్న అబ్బాయిలకి, అమ్మాయిలకి **కౌమార దశకు సంబంధించిన ఆలోచనలు, సమస్యలు, అపోహలు, వేధింపులు, చట్టాలు వంటి విషయాలపై పూర్తి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి – కనీసం నెలకొక్కసారి.** కొన్ని పాఠశాలల్లో ఇప్పటికే ఇది జరుగుతుంది, వారి అనుభవాలు మిగతా వారితో పంచుకోవాలి. ఈ ప్రయత్నం ప్రతీ పాఠశాలలో జరగాలి. PCT లాంటి సంస్థలు ఇదే పనిలో ఉన్నాయి. అలాంటి సంస్థల సేవలు ఉపయోగించుకోవాలి.

4) లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మికులకు సంబంధించిన ప్రతీ చట్టం గురించిన పూర్తి సమాచారం, హెల్ప్ లైన్ నంబర్స్, వెబ్ సైట్ అడ్రస్ లు **పాఠశాల ఆవరణలో** విధిగా ఉంచాలి. వాటి గురించి బాహాటంగా మాట్లాడుకునే స్వేచ్ఛ ని విద్యార్థులకు కల్పించాలి. తల్లిదండ్రులతో కూడా వీటి గురించి మాట్లాడి, వారిలో అవగాహన పెంచే ప్రయత్నం చెయ్యాలి.

5) అన్ని **ఉపాధ్యాయ సంఘాలు** ఈ విషయంలో ముందుకు వచ్చి వివిధ స్థాయిల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతీ సదస్సులో ఈ విషయాన్ని అజెండా లో చేర్చి విస్తృతంగా చర్చించాలి.

6) జిల్లా స్థాయి అధికారులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పిల్లలకు, ఉపాధ్యాయులకు కూడా **జిల్లా స్థాయిలో ఒక హెల్ప్ లైన్ (whatsApp సదుపాయంతో సహా)** ఏర్పాటు చెయ్యాలి (dedicated to school children and teachers). ఏ కారణం చేతనైనా పాఠశాల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు పై అధికారులకు తెలుపుకునే వీలుండాలి.

7) స్థానిక పెద్దలు, తల్లిదండ్రులు, యువజన సంఘాలు, పూర్వ విద్యార్థులు తరచూ పాఠశాలను సందర్శించడం, ఉపాధ్యాయులతో, పిల్లలతో మాట్లాడటం చెయ్యాలి.

8) చట్ట సభలకు అనుమతి ఉన్న విద్యా వేత్తలు, మేధావులు ఇటువంటి విషయాలు ఆ సభల్లో చర్చకు తీసుకు రావాలి. రాష్ట్ర స్థాయిలో చర్చిస్తే ఎటువంటి సమస్య అయినా త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది.

9) స్కూల్లో అయినా, బయట అయినా, లైంగిక దాడులు తగ్గాలి అంటే ప్రధానంగా **తల్లిదండ్రులలో అవగాహన పెరగాలి.** బాధితులెప్పుడూ సిగ్గుపడాల్సిన అవసరం లేదని, అది పరువు సమస్య కాదని, నేరం చేసిన వాళ్లపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం బాధితుల పక్షం నిలుస్తుందని వారికి అవగాహన కల్పించాలి. తమ పిల్లలపై ఎక్కడ ఎటువంటి వేధింపు జరిగినా, ఆ విషయం ఇంటికి వచ్చి ధైర్యంగా తమకు చెప్పుకునే స్వేచ్ఛ ను పిల్లలకు ఇవ్వాలనే విషయం ప్రతీ తల్లికీ, తండ్రికీ తెలియాలి. SMC / PMC మీటింగ్స్ కి తల్లిదండ్రులు తప్పని సరిగా అటెండ్ అయ్యి, పాఠశాల ఉపాధ్యాయులతో ప్రతీ నెలా ఈ విషయాలపై చర్చించే కార్యక్రమం ఖచ్చితంగా అమలు చెయ్యాలి. **ఈ పని ప్రభుత్వం తలచుకుంటే మాత్రమే జరుగుతుంది. అమ్మ ఒడి లేదా ఇతర పథకాలు పొందాలంటే, ఈ SMC / PMC మీటింగ్ కి రావడం తప్పనిసరి అని ఒక జీవో రూపంలో చేయవచ్చు.**

10) సెప్టెంబర్ 13 వ తేదీన కాకినాడలో జరిగిన '**Safety and Security of Girl Students in Educational Institutions**' workshop లో మన **గౌరవనీయ విద్యా శాఖా మంత్రి శ్రీ. ఆదిమూలపు సురేష్ గారు** మాట్లాడుతూ

# మేధావుల మౌనం – ఎవరికి ప్రమాదం?

– బడి పిల్లలపై జరిగే లైంగిక దాడుల విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని, ఏ మాత్రం సహించేది లేదని ప్రస్తావించారు. అలాగే, పోలీస్ వారు, CWC (Child Welfare Committee) వారే కాకుండా వీటిని అరికట్టాలంటే సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ దీనిలో తగిన పాత్రను వహించాలని గుర్తుచేశారు. అదే సదస్సులో **గౌరవ MP శ్రీమతి వంగా గీత గారు** కూడా మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ఈ విషయం పై దృష్టి పెట్టి, సమస్య పరిష్కరించే ప్రయత్నం చేస్తానని మాట ఇచ్చారు.

**ఇటువంటి ప్రజా ప్రతినిధులు తలచుకుంటే ఈ సమస్య ఒక కొలిక్కి రావడం పెద్ద కష్టం కాదు.**

## అభ్యర్థన – APPEAL

- సమాజ నిర్మాణం తరగతి గది లోనే జరుగుతుంది. అటువంటి తరగతి గదిలో పిల్లల మధ్య కూర్చొనే అర్హత పిల్లల ప్రేమికులకే ఉండాలి.

- ఏ శాఖలో అయినా కలుపు మొక్కలు ఏరివేసే బాధ్యత ఆ శాఖలో ఉన్న వారిదే అవుతుంది. కాని విద్యా శాఖలో మాత్రం ఆ బాధ్యత ప్రతీ ఒక్కరూ తీసుకోవాలి. ఎందుకంటే ఈ విషయాల్లో **మౌనం అందరికీ ప్రమాదం. నష్టం ఏ ఒక్కరితోనో, ఏ ఒక్క చోటో ఆగిపోదు. అది విద్యా ప్రమాణాల నాణ్యత అయినా, పరీక్షల్లో అడ్డ దారులైనా, పిల్లలపై లైంగిక వేధింపు లైనా.**

- **చివరగా ఒక్క విషయం – తమ తరగతిలో పిల్లలకోసం తమ సొంత పిల్లలని, కుటుంబ సమయాన్ని పక్కన పెట్టి రేయింబవళ్ళు శ్రమిస్తున్న మెరికల్లాంటి ఉపాధ్యాయులున్నారు. *"ప్రతీ నెలా నా జీతం నా తరగతి పిల్లలకి ఇచ్చెయ్యాలి…ఎందుకంటే వారి నుండి నేను ప్రతీ రోజూ చాలా నేర్చుకుంటున్నాను"* అని నిజాయితీగా ఒప్పుకుంటూ, ప్రేమతో బోధిస్తూ, రకరకాల ప్రయోగాలతో తరగతి గదినే అద్భుతమైన ప్రపంచంగా మారుస్తున్నారు. వీళ్ళంతా ఒక నిశ్శబ్ద యుద్ధంలా వారి పని వారు చేసుకు పోతున్నారు. వీరి వల్ల సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పై ఉన్న మునుపటి గౌరవం తిరిగి వస్తుంది. ఇటువంటి వారి సంఖ్య పెరగాలి. వీరి కథలు ప్రతీ పాఠశాలకీ చేరాలి.**

  **అయితే పరీక్షల్లో చూచిరాతలు, పిల్లలపై లైంగిక వేధింపులు లాంటి సమస్యల వలన, వాటిని ప్రోత్సహిస్తున్న కొద్దిమంది వ్యక్తుల వలన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ప్రతీ ఒక్కరూ తల దించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి, పిల్లలను ప్రత్యక్షంగా బాధిస్తున్న, నష్ట పరుస్తున్న ఈ సమస్యల మీద ప్రతీ ఒక్కరూ స్పందించాలి, మాట్లాడాలి, మౌనాన్ని వీడాలి. అదే మా ప్రయత్నం.**

*సూర్య ప్రసాద్, పడాల ఛారిటబుల్ ట్రస్ట్, padalasurya@yahoo.com; +91 73311 23044*

# మహిళలను గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి




'సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ గర్ల్ స్టూడెంట్స్ ఇన్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్' వర్క్‌షాపులో మాట్లాడుతున్న విద్యా మంత్రి ఆదిమూలపు సురేష్. చిత్రంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎంపీ వంగా గీత తదితరులు

- బాలికలు, మహిళలకు వేధింపులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ధ్యేయం
- పాఠశాలల్లో 'డోంట్ టచ్' అమలు కావాలి
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

- వివరాలు 16లో▸

సాక్షి తూర్పుగోదావరి
Sat, 14 September 2019
https://epaper.sakshi.com/c/43551190

ఈనాడు
epaper.eenadu.net

# బాలికల సంరక్షణ... సమాజ బాధ్యత

**రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్**

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: బాలికల భవిష్యత్తును పరిరక్షించడంలో సమాజం కీలక బాధ్యత వహించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సూచించారు. కాకినాడలోని అంబేడ్కర్ భవన్‌లో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా శుక్రవారం 'విద్యా సంస్థల్లో బాలికల భవిత, రక్షణ' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో బాలికలు, మహిళలపై అత్యాచారాలు, వేధింపులు, దాడులు పెరుగుతున్నాయని, వీటిని నియంత్రించేందుకు అంతా ఐక్యంగా పాటుపడాలన్నారు. వరకట్నం, బాల్య వివాహాలు, విడాకులు, నిర్భయ, పోక్సో తదితర చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ నిత్యం దుర్ఘటనలు ఎదురవుతూనే ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లోనూ 50 శాతం రిజర్వేషన్లు మహిళలకు కేటాయిస్తే అనేక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సామాజిక రుగ్మతలను పారదోలేందుకు విద్యాశాఖ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.




మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

### మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం..

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ బాలికలు, మహిళల దాడులను నియంత్రించడంలో మహిళా కమిషన్ క్రియాశీలక పాత్ర పోషిస్తోందన్నారు. పాఠశాలల్లో పిల్లల స్థితిగతులపై మానసిక అధ్యయనం చేయాలని సూచించారు. విద్యా సంస్థల్లో బాలికల భద్రత, రక్షణ కేవలం పోలీసులకే పరిమితం కాదని, అందరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ పద్మలత మాట్లాడుతూ అత్యాచారాలు, ఇతర దురాగతాలు జరిగితే వెంటనే బయటకు రావడం లేదన్నారు. మహిళా కమిషన్ డైరెక్టర్ సుయిజ్, కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ డి. మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మహిళలు, చిన్నారులు, బాలికలపై వేధింపులను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జేసీ-2 బి. రాజకుమారి నేతృత్వంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా సంస్థల్లో బాలికల సమస్యలపై మాట్లాడడం బాధాకరమన్నారు. ఈ సదస్సులో కాకినాడ నగర మేయర్ సుంకర పావని, జిల్లా ఎస్పీ నయీం అస్మి, రాజమహేంద్రవరం అర్బన్ ఎస్పీ షిమోషీ బాజ్‌పాయ్, కాకినాడ అర్బన్ డీఐ వాణీకుమారి, పి. గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఐసీడీఎస్ పీడీ సుఖజీవన్‌బాబు, డీఈవో ఎస్. అబ్రహం, ఎస్ఎస్ఏ పీవో బి. విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


వెరికోస్ వెయిన్స్ విస్తృత
కాళ్లలో నరాల వాపు (వేరి
బాధితులకు శ

ప్రఖ్యాత వైద్యులు, సీనియ
డా॥ రా
M.D., FRCR (En
Fellow in Interv
M.D., AVIS Hosp
దిగువ హాస్పిట
క
47-1-104, 6వ వీధి,
తేది: 15-09-2019 ఆదివారం 10
గమనిక కాళ్లల్లో నరాల వా
డా. రాజా.వి. కొప్పాలగారు, విశాఖ
గురక నివారణ, స్లీప్ అ
డా. గౌతమ్ దెందుకూ


Date : 14/09/2019 EditionName : ANDHRA PRADESH( EAST GODAVARI ) PageNo : 03

# మహిళలు,బాలికల పై వేదింపులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ద్యేయం :

## ర్రాష్ట విద్యాశాఖ మంత్రి ఆదిమూల సురేష్

కాకినాడ,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త



రాష్ట్రంలో బాలికలు,మహిళలు పట్ల వేదింపులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దదం ప్రభుత్వ ద్యేయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలు సురేష్ తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ అంబెద్కర్ భవన్‌లో ఏర్పాటు చేరసిన విద్యాసంస్దల్లో బాలబాలికల రక్షణ ,భద్రత అనే అంశంపై జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆద్వర్యంలో నిర్వహించిన వర్కుషాపులో ముఖ్య అతిధులుగా మంత్రి సురేష్, మహిళ్యా కమీషన్ చైర్మన్ వాసురెడ్డి పద్మ పాల్గొని పలు విషయాలు తెలిపారు. విద్యా సందస్దల్లో బాలికల రక్షణకు విద్యాశాఖ పూర్తి భాద్యతా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేవలం విద్యా సంస్దలలోనే కాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో ,పరిశ్రమలు,అన్ని చోట్ల మహిళలు వేదింపులకు గురవుతున్న మాట వాస్తవమేనన్నారు. ఇలా వేదించే పురుష/లు అందరు

7వ పేజీలో...

వార్త
Sat, 14 September 2019
https://epaper.vaartha.com/c/43573543